మనం
హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
శనివారం | 17 | అక్టోబర్ | 2026 పేజీలు: 10




## మేడ్చల్‌లో అంబరాన్ని అంటిన

# బతుకమ్మ సంబరాలు

తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడిన మహిళలు 2



# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి

### స్పెషల్ చీఫ్ సెక్రటరీ  వికాస్ రాజ్

2 మేడ్చల్, అక్టోబర్ 16: ( మనం జిల్లా ప్రతినిధి): ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి స్పెషల్ చీఫ్ సెక్రటరీ  వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్లో శుక్రవారం ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయం, ఉద్యానవన, తాగునీటి సరఫరా, విద్యుత్తు, నీటి పారుదల  తదితర అంశాలపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎల్నినో ప్రత్యేక అధికారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ మేడ్చల్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ లు మను చౌదరి, దీపక్ తివారీ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, టీజీపీసీడిఎల్ చైర్మన్ జితీష్ వి.పాటిల్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

## జర్నలిస్టుల క్షేమమే మా ప్రాధాన్యం

ఎల్లప్పుడూ అండగా ఉంటాం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

సైనిక్పురి క్యాంప్ కార్యాలయంలో కాప్రా ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ

రూ. 60 లక్షల బీమా సౌకర్యం కల్పించిన బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు భైరి నవీన్ గౌడ్..

3



కాప్రా సర్కిల్, అక్టోబర్ 16 (మనం న్యూస్): నిరంతరం సమాజ హితం కోసం శ్రమిస్తూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విలేకరులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పునరుద్ఘాటించారు. జర్నలిస్టుల భద్రత, వారి కుటుంబాల సంక్షేమానికి తమ వంతు బాధ్యతగా ఎప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు.

# ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: రాంచందర్ రావు

17 వేల మంది ఉద్యోగులకు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి..

ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి సంఘీభావం..




2

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: రాంచందర్ రావు

**17 వేల మంది ఉద్యోగులకు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి..**

**ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి సంఘీభావం..**







సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలందిస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్హెచ్ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ లను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాం చందర్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో ఎన్హెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాలో పాల్గొన్న ఆయన, వారి ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో సేవలందిస్తున్న సుమారు 17 వేల మంది వైద్యులు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది తమ హక్కుల సాధన కోసం సమ్మెకు దిగడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. వీరిలో దాదాపు 70 శాతం మంది మహిళలే ఉన్నారని, అయినప్పటికీ ప్రసూతి సెలవులు, ఆరోగ్య, జీవిత బీమా, ఉద్యోగ భద్రత వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం విచారకరమన్నారు. వైద్య సేవలతో పాటు అదనపు పరిపాలనా పనులను కూడా వారిపై మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**జీవో ప్రకారం వేతనాలు సవరించాలి..**

జీవో నంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు, జీవో 1195 నిబంధనల మేరకు ఎన్హెచ్ఎం ఉద్యోగుల వేతనాలను సవరించాలని రాం చందర్ రావు డిమాండ్ చేశారు. ఆయుర్వేదం, హోమియోపతి, ఆయుష్ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందితో సహా ఆరోగ్య రంగ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్హెచ్ఎం కు తనవంతు నిధులు విడుదల చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు.

**కాంట్రాక్టు విధానానికి స్వస్తి పలకాలి..**

శాశ్వత నియామకాలు చేపట్టకుండా కాంట్రాక్టు, పార్ట్ టైమ్ విధానాల ద్వారా ఉద్యోగులతో పనిచేయించుకోవడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. వైద్య రంగంతో పాటు విద్యా వ్యవస్థలోనూ కాంట్రాక్టు ఉద్యోగులపై ప్రభుత్వం ఆధారపడుతోందని విమర్శించారు. గతంలో జూనియర్ డాక్టర్లు, ఆయుష్ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాడిందని గుర్తుచేశారు. అక్టోబర్ 13 నుంచి విధులు బహిష్కరించిన ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత, గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించాలని రాంచందర్ రావు కోరారు.ల



# మేడ్చల్‌లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు

**తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడిన మహిళలు**



మేడ్చల్, అక్టోబర్ 16: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ పట్టణంలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా మహిళలు జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో అందంగా తయారుచేసిన బతుకమ్మలతో వచ్చి ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ మహిళలు ఆడిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఏడు రోజులపాటు తంగేడు,గునుగు,బంతి చామంతి వంటి తీరొక్క పూలతో బతుకమ్మను గౌరవంగా పేర్చి సంబరాలను జరుపుకున్నారు.వైవిధ్యాలు సమర్పించి బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మేడ్చల్ లో ప్రతి సంవత్సరం ఏడు రోజులు మాత్రమే సంబరాలను జరుపుకుంటారు. ఇదే మాదిరిగా ఈ సంవత్సరం సైతం ఏడు రోజులు బతుకమ్మ వేడుకలను జరుపుకొని చివరి రోజు నిమజ్జనం చేశారు. మేడ్చల్ పట్టణంలో గల్లి గల్లి లో మహిళలు బతుకమ్మలను పెట్టి బతుకమ్మ ఆడుతూ సంబరాలను జరుపుకున్నారు.

**జిల్లా కలెక్టరేట్ లో**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ లో బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

బతుకమ్మ ప్రకృతి పండుగ.. ప్రకృతిలో దొరికే గునుగు, తంగేడు, తీరు రుద్రాక్షాలు, బంతి, చామంతి తీరొక్క పూలతో తీరు తీరు బతుకమ్మను పేర్చి అవే పువ్వులను నీటిలో వేసే ప్రకృతి పండుగ ఇది. పర్యావరణాన్ని కాపాడే పండుగ ఈ బతుకమ్మ తెలంగాణ సాంస్క ృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా చీఫ్ ప్లానింగ్ ,జిల్లా విద్యాశాఖ, జిల్లా కో-ఆపరేటివ్,ఐ సి డి ఎస్, డి ఐ ఈ ఓ, ఆర్ అండ్ బి, జిల్లా సంక్షేమ శాఖలు ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాలు, సంస్క ృతి స్ఫురించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.

# ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్**



మేడ్చల్, అక్టోబర్ 16: ( మనం జిల్లా ప్రతినిధి): ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్లో శుక్రవారం ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయం, ఉద్యానవన, తాగునీటి సరఫరా, విద్యుత్తు, నీటి పారుదల తదితర అంశాలపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎల్నినో ప్రత్యేక అధికారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ మేడ్చల్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ లు మను చౌదరి, దీపక్ తివారీ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, టీజీపీసీడీఎల్ చైర్మన్ జితీష్ వి.పాటిల్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ...ఎల్నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. వ్యవసాయ రంగంపై ఎల్నినో ప్రభావాన్ని అంచనా వేస్తూ రైతులకు అవసరమైన సూచనలు అందించాలని, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నీటి వనరులతో కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వేసవిలో పశువులకు పశుగ్రాసం, త్రాగునీటికి ఇబ్బంది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.భూగర్భ జలాలు తగ్గుముఖం పడడంతో నీటి సంరక్షణకు చేపట్టాల్సిన పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు తెలిపారు.జిల్లాలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు సమాచారాన్నిఅందించాలని ఆయన అధికారులకు సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజల్ అహ్మద్, ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డీఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల క్షేమమే మా ప్రాధాన్యం

**ఎల్లప్పుడూ అండగా ఉంటాం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**సైనిక్పురి క్యాంప్ కార్యాలయంలో కాప్రా ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ**

**రూ. 60 లక్షల బీమా సౌకర్యం కల్పించిన బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు భైరి నవీన్ గౌడ్..**





కాప్రా సర్కిల్, అక్టోబర్ 16 (మనం న్యూస్): నిరంతరం సమాజ హితం కోసం శ్రమిస్తూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విలేకరులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పునరుద్ఘాటించారు. జర్నలిస్టుల భద్రత, వారి కుటుంబాల సంక్షేమానికి తమ వంతు బాధ్యతగా ఎప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు.

శుక్రవారం సైనిక్పురిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాప్రా ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల కోసం బీఆర్ఎస్ కాప్రా డివిజన్ అధ్యక్షుడు భైరి నవీన్ గౌడ్ ప్రత్యేక చొరవతో రూ. 60 లక్షల విలువైన హెల్త్ / లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలను చేయించారు. ఈ ఇన్సూరెన్స్ బాండ్లను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జర్నలిస్టులకు స్వయంగా పంపిణీ చేశారు.

**జర్నలిస్టులు ఐక్యంగా సాగాలి:**

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ - 'ఎండనక, వాననక ప్రాణాలను సైతం పణంగా పెట్టి వార్తల సేకరణలో నిమగ్నమయ్యే జర్నలిస్టులకు సామాజిక భద్రత ఎంతో అవసరం. కాప్రా డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల కోసం రూ. 60 లక్షల ఉచిత ఇన్సూరెన్స్ అందించడం ఎంతో అభినందనీయమైన కార్యక్రమం. జర్నలిస్టులందరూ భేదాభేదాలు మరిచి ఐక్యంగా ఉంటూ ప్రాంతీయ అభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలి. ఉప్పల్ నియోజకవర్గంలో పనిచేస్తున్న ప్రతి విలేకరికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాం.'

జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆలోచించి ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించిన బీఆర్ఎస్ నాయకుడు భైరి నవీన్ గౌడ్ను ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

జర్నలిస్టుల హర్షం - నాయకుల భాగస్వామ్యం తమ కుటుంబాలకు భద్రత కల్పించేలా రూ. 60 లక్షల ఇన్సూరెన్స్ పాలసీలను అందించడంపై కాప్రా ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, భైరి నవీన్ గౌడ్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ వేడుకలో బీఆర్ఎస్ ప్రముఖ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ టీవీ ఛానెళ్ల రిపోర్టర్లు, కెమెరామెన్లు మరియు స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

**చంద్రపురి కాలనీ 2వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బూడిద వెంకటేష్.**

జవహర్నగర్, అక్టోబర్ 16 (మనం న్యూస్): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చంద్రపురి కాలనీ 2వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినందుకు బూడిద వెంకటేష్ పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన నాయకుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు, ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, చంద్రపురి కాలనీ 2వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బూడిద వెంకటేష్ స్పష్టం చేశారు.

## బతుకమ్మ సంప్రదాయ పాటల పుస్తకం ఆవిష్కరణ

హైదరాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) : డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ప్రచురించిన 'బతుకమ్మ : ట్రెడిషనల్ సాంగ్స్ అండ్ కల్చర్' పుస్తకాన్ని శుక్రవారం హిమాయత్నగర్లోని ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్(ఓజీఎస్)లో తిరునగరి దేవకీదేవి ఆవిష్కరించారు. ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, రచయిత డా.సత్యనారాయణ ద్యావనపల్లి రచించారు. ఈ సందర్భంగా దేవకీదేవి మాట్లాడుతూ బతుకమ్మ పాటలు తెలంగాణ మహిళల జీవన విధానం, కుటుంబ సంబంధాలు, ప్రకృతితో అనుబంధం, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. వేదకుమార్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడమే ట్రస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. రచయిత డా.సత్యనారాయణ ద్యావనపల్లి మాట్లాడుతూ బతుకమ్మ పాటలు మహిళల మౌఖిక చరిత్రకు, సామాజిక స్మృతికి నిదర్శనమని తెలిపారు. బతుకమ్మ పాటలు, చరిత్ర, ఆచారాలు, సాంస్కృతిక విశిష్టతలను ఇందులో వివరించారు. ఈ కార్యక్రమంలో సులోచనా రాణి, ఓజీఎస్ డైరెక్టర్ ప్రార్థన, డక్కన్ ప్రెస్కు చెందిన సుదర్శన్, భాగ్య నరేందర్, ఎన్ఆర్ఐ నవత, బాలరాజ్, కట్ట ప్రభాకర్, సచిన్, ఖైజర్ స్థానిక మహిళలు పాల్గొన్నారు.




## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి: తలసాని

**సనత్ నగర్, అమీర్ పేటలో దేవీ నవరాత్రుల పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..**

**మూలా నక్షత్రం సందర్భంగా చిన్నారులకు పలకలు, నోట్బుక్స్ పంపిణీ..**



సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) అమ్మవారి కరుణాకటాక్షాలతో విస్తారంగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా శుక్రవారం సనత్ నగర్, అమీర్పేట డివిజన్ లలో పర్యటించి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సనత్ నగర్ లోని సెవెన్ టెంపుల్స్ ను సందర్శించిన తలసానికి ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన చండీహోమం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని, సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పండితులు తీర్థప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం అమీర్పేట డివిజన్ ఎస్ఆర్ నగర్ లోని శ్రీ వినాయక టెంపుల్ ను సందర్శించి రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు పలకలు, నోట్బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం అదే ప్రాంతంలో జై భవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈఓలు సత్యనారాయణ, నరేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## నిరుద్యోగ యువతకు ఉచిత డేటా ఇంజినీరింగ్ కోర్సు

హైదరాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) : తెలంగాణ నిరుద్యోగ యువత కోసం 90 రోజుల ఉచిత డేటా ఇంజినీరింగ్ కోర్సును శ్రీ సత్యసాయి దక్షత కార్యక్రమం ద్వారా అందజేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-26 మధ్య ఎంసీఏ, బీ.టెక్, ఎం.టెక్, ఎంఎస్సీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆఫ్లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. పైథాన్, ఎస్.క్యూ.ఎల్, ఏఐ టూల్స్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణతోపాటు ఉద్యోగ నియామక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. గత బ్యాచ్లో 350 మందికి పైగా శిక్షణ పొందగా, 100 మందికి పైగా ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు రీరీరీ.ఛ్చీజుటఃజ్బిఋ.ఛజీలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర పూర్తి వివరాలకు ఫోన్ : 9052372023 నంబర్లో సంప్రదించాలన్నారు.

# టిపిఓ దొరకరు.... కమీషనర్ పట్టించుకోరు

**ఎల్లంపేట నిండా అక్రమ కట్టడాలే**

**ఎల్లంపేట మున్సిపాలిటీ అభివృద్ధి జరిగేది ఎలా**

**కొత్త మున్సిపాలిటీ అయినా.... అభివృద్ధి శూన్యం**




మేడ్చల్, అక్టోబర్ 16: ( మనం జిల్లా ప్రతినిధి ): కొత్తగా ఏర్పడ్డ ఎల్లంపేట మున్సిపాలిటీకి పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న టిపిఓ ఇక్కడ ఇంచార్జిగా వ్యవహరించడంతో పట్టణ అభివృద్ధి కుంటూ పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారి వారానికి రెండు రోజులు మాత్రమే చుట్టపు చూపుగా వచ్చిపోతుండడంతో ప్లానింగ్ పై దృష్టి సారించలేకపోతున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారి నిర్లక్ష్యం వలన ఎల్లంపేట ఊరు నిండా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో పాటు

**జి ప్లస్ టు అనుమతులు పొంది జి ప్లస్ ఫోర్ భవనాలు**

నిర్మిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులలో చలనం లేదు. టిపిఓ తీరు ఇలా ఉంటే... కనీసం కమీషనర్ అయినా పట్టించుకుంటున్నారా అంటే అది లేదు అంటూ జోరుగా విమర్శలు వినిపిస్తున్నాయి.

**కొత్త మున్సిపాలిటీ... శతకోటి సమస్యలు**

గ్రామపంచాయతీ గా ఉన్న ఎల్లంపేట ను మున్సిపాలిటీగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఇక్కడ సరిపడా సిబ్బందిని కేటాయించకపోవడంతో సమస్యలు పోటీ పడుతున్నాయి. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో డ్రైనేజీ సమస్యలతో పాటు రోడ్ల సమస్యల తో ప్రజలు సతమతమవుతున్నారు. ఎవరికి తోచిన విధంగా వారు అక్రమ నిర్మాణాలు చేసుకుంటూ వెళుతున్నారు.

వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా మారితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆశపడ్డ గ్రామీణ ప్రజలకు నిరాశే మిగులుతుంది.

**పూర్తిస్థాయి టిపిఓ ను నియమించాలి**

ఎల్లంపేట మున్సిపల్ అభివృద్ధి చెందాలంటే పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారిని నియమిస్తే తప్ప అభివృద్ధి జరగదని స్థానికులు పేర్కొంటున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి వారంలో రెండు రోజులు మాత్రమే కార్యాలయానికి వచ్చి వెళుతుండడంతో పట్టణంలో ఏం జరుగుతుందో పర్యవేక్షించే సమయం కూడా లేకుండా పోతుందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**కమిషనర్ పట్టించుకోవాలి**

ఎల్లంపేట మున్సిపాలిటీకి పూర్తిస్థాయి డిపిఓ లేకపోవడం వల్ల నగర అభివృద్ధి బాధ్యతలను కమిషనర్ పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీకి కూత వేటు దూరంలో అక్రమ నిర్మాణాలు సాగుతున్న అటు వేపు అధికారులకు కన్నెత్తి చూడకపోవడం పై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ తో పాటు మున్సిపల్ అధికారుల

కండ్ల ముందే అక్రమ కట్టడాలు సాగుతున్న వాటిని అడ్డుకున్న ప్రయత్నం చేయడం లేదని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

**ఫోన్‌కు రెస్పాన్స్ గాని టౌన్ ప్లానింగ్ అధికారి**

అక్రమ కట్టడాల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారి వివరణ కోసం పలుమార్లు ఫోన్లు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారి మాత్రం ఫోన్ కు రెస్పాండ్ కారని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆఫీస్ కి వెళ్తే

దొరకరు.. పోనీ ఫోన్లో మాట్లాడదామంటే ఫోన్ కు రెస్పాన్స్ గారు మరి ఎలా అంటూ అందరూ తలలు పట్టుకుంటున్నారు.



# జిల్లాలో 2బి బార్ల కేటాయింపు లాటరీలో 5గురు అభ్యర్థుల ఎంపిక

మేడ్చల్, అక్టోబర్ 16: ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో 2బి బార్ల కేటాయింపు లాటరీలో 5గురు అభ్యర్థులు ఎంపికయ్యారు.జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ యూనిట్కు సంబంధించి, అలియాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో 2బి బార్ల కేటాయింపు కోసం శుక్రవారం జిల్లా కార్యాలయ సముదాయంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టారు.ఈ లాటరీలో అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఒక బార్కు టోకెన్ నంబర్ 175 కలిగిన శైలజ కాసులవధ ఎంపికయ్యారు.

మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రెండు బార్లకు టోకెన్ నంబర్ 106 కలిగిన కురా జ్యోతి, టోకెన్ నంబర్ 87 కలిగిన సుంకరి సృజన్ కుమార్ ఎంపికయ్యారు.

అదేవిధంగా, ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రెండు బార్లకు టోకెన్ నంబర్ 180 కలిగిన ముద్దన రాహుల్ గౌడ్, టోకెన్ నంబర్ 207 కలిగిన రూపాని శివ కుమార్ ఎంపికయ్యారు. మొత్తం ఐదు 2ఆ బార్ల కేటాయింపునకు సంబంధించి లాటరీ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ తెలిపారు.

# మేడ్చల్ జిల్లా బీజేవైఎం కార్యదర్శిగా శశాంక్ సింగ్ (రాహుల్) నియామకం

**పార్టీ బలోపేతానికి, యువత అభ్యున్నతికి కృషి చేస్తా: శశాంక్ సింగ్**




జవహర్ నగర్, అక్టోబర్ 16 (మనం న్యూస్): భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో గత పదేళ్లుగా క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న జవహర్ నగర్ డివిజన్కు చెందిన శశాంక్ సింగ్ (రాహుల్) మేడ్చల్ జిల్లా భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించి, ప్రోత్సహించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు రాగం అర్జున్లకు శశాంక్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనకు నిరంతరం మార్గదర్శనం చేస్తూ ప్రోత్సహిస్తున్న జవహర్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కళికోట కమలాకర్తో పాటు తన ప్రయాణంలో అండగా నిలిచిన తల్లిదండ్రులకు, సహకరించిన పార్టీ పెద్దలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శశాంక్ సింగ్ (రాహుల్) మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. యువతను బీజేపీ సిద్ధాంతాల వైపు చైతన్యపరచడంతో పాటు, వారి అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తూ, యువతను సంఘటితం చేసి మేడ్చల్ జిల్లాలో బీజేపీ, బీజేవైఎంల బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# డిఫెండింగ్ చాంప్ రాయల్స్ చోళ చీఫ్స్ షాక్



హైదరాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) : ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్లో చోళ చీఫ్స్ 5-3తో డిఫెండింగ్ చాంపియన్ రాజ్పుతానా రాయల్స్పై విజయం సాధించింది. నెక్లెస్ రోడ్లోని పీపుల్స్ ప్లాజాలో శుక్రవారం జరిగిన మ్యాచ్లో అలెజాండ్రా ఉస్కియానో 80కి 79 పాయింట్లు సాధించగా, రజత్ చౌహాన్ చివరి బాణంతో కీలకమైన 9 పాయింట్లు సాధించాడు. తొలి సెట్లో టోక్యో ఒలింపిక్ చాంపియన్ మెతే గాజోజ్ ఆరు పాయింట్లకే పరిమితం కాగా, రెండో సెట్లో స్వాతి స్థానంలో బరిలోకి దిగిన ఎల్లా గిబ్సన్ రాణించింది. మూడో సెట్లో చీఫ్స్ కాంపౌండ్ ఆర్చర్లు 40కి 40 పాయింట్లు సాధించారు. ఆరు పాయింట్లతో ఉన్న చీఫ్స్ ప్లేఆఫ్స్కు దూరమవగా, ఎనిమిది పాయింట్లతో ఉన్న రాయల్స్ టైటిల్ రేసులో ఒత్తిడిని ఎదుర్కొంటోంది.





## లక్ష్మాపూర్లో భరతనాట్యంతో అలరించిన చిన్నారులు

శామీర్ పేట్, అక్టోంబర్ 16 ( మనం ): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు లక్ష్మాపూర్లో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారి సన్నిధిలో చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, అమ్మవారి 9 అవతారలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ వస్త్రధారణతో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన నృత్య ప్రదర్శనతో ఉత్సవ ప్రాంగణం సందడిగా మారింది. చిన్నారుల ప్రతిభను చూసిన భక్తులు, స్థానికులు వారిని అభినందించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనలపై కొరడా..

**42 కేసుల పరిష్కారం.**

**నలుగురికి నాలుగు రోజుల జ్యుడీషియల్ కస్టడీ..**

**నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక..**




సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) నగరంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు నమోదు చేసిన 42 కేసులను శుక్రవారం నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్లో ఉన్న ఎనిమిదో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (డీడీ) కోర్టులో పరిష్కరించారు. ఈ కేసులకు సంబంధించి 42 మందిని కోర్టులో హాజరుపరిచారు. తీవ్రంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన నలుగురికి న్యాయస్థానం శిక్ష విధించింది. ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ విధించిందని చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బి. జగన్ రెడ్డి వెల్లడించారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. నిబంధనలను నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**37 మంది లబ్ధిదారులకు రూ.37 లక్షల ఆర్థిక సాయం**

**ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం**



చేవెళ్ల, అక్టోబర్ 16(మనం న్యూస్): చేవెళ్ల మండలం, మున్సిపాలిటీ పరిధికి చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.37,00,592, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పంపిణీ చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా..... ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.... అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అండగా నిలుస్తోందన్నారు. ఆడపిల్లల వివాహ సమయంలో కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ ఈ పథకాలు ఎంతో తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ సమతా వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, సర్పంచులు మల్లారెడ్డి, గౌరీ చర్ల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు లావణ్య శంకర్, ఫరీన్ ఖదీర్ పాష , అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,గిరిధర్ రెడ్డి, తలారం ఉపసర్పంచ్ నవాజ్,మాజీ సర్పంచులు, ఎమ్మార్వో కృష్ణయ్య, సీనియర్ నాయకులు పడాల ప్రభాకర్,జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్,కేసారం శ్రీనివాస్, మల్లేష్, కర్ని శివప్రసాద్, గుట్టల రాజేందర్, గని, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు...

# ఆకలి దీక్షకు ఆశల వెలుగు

**హిమాయత్నగర్ 60 గజాల బాధితులకు మంత్రి పొంగులేటి భరోసా!**

**- 100 రోజులకు పైగా ఎండనక.. వాననక న్యాయం కోసం నిరాహార దీక్ష**

**- భీం భరత్ చొరవతో రెవెన్యూ మంత్రితో బాధితుల భేటీ**

**- త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ.. దీక్ష విరమించిన బాధితులు**




చేవెళ్ల /మొయినాబాద్, అక్టోబర్ 16(మనం న్యూస్): న్యాయం కోసం వంద రోజులకు పైగా నిరాహార దీక్ష చేస్తున్న హిమాయత్నగర్ 60 గజాల స్థలాల బాధితులకు ఊరట లభించింది. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్నగర్ రెవెన్యూ సర్వే నంబర్ 151లో స్థలాల సమస్యపై పోరాడుతున్న బాధితులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీం భరత్ చొరవతో బాధితులు శుక్రవారం మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. మంత్రి హామీతో బాధితులు తమ నిరాహార దీక్షను విరమించారు.

### వంద రోజులకు పైగా అలుపెరగని పోరాటం

హిమాయత్నగర్లో 60 గజాల స్థలాలకు సంబంధించిన సమస్య పరిష్కారం కోసం బాధితులు వంద రోజులకు పైగా నిరాహార దీక్ష కొనసాగించారు. ఎండ, వానలను లెక్కచేయకుండా, పండుగలను సైతం పక్కనపెట్టి తమకు న్యాయం జరగాలనే ఆశతో పోరాటాన్ని కొనసాగించారు. రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

ఈ నేపథ్యంలో బాధితుల సమస్యను చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీం భరత్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బాధితులతో కలిసి మంత్రిని కలిసిన ఆయన, వారి ఇబ్బందులను వివరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

### బాధితులకు న్యాయం చేస్తామని మంత్రి హామీ

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన బాధితులు తమ ఆర్థిక పరిస్థితులు, ఎదుర్కొంటున్న ఇబ్బందులు, స్థలాల సమస్యను వివరించారు. వారి విజ్ఞప్తులపై స్పందించిన మంత్రి, హిమాయత్నగర్ 60 గజాల స్థలాల బాధితులకు త్వరలో న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న ఆశ బాధితుల్లో చిగురించింది.

### భీం భరత్ చొరవతో దీక్ష విరమణ

మంత్రి హామీ అనంతరం భీం భరత్ నిరాహార దీక్ష స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. మంత్రితో జరిగిన భేటీ వివరాలను తెలియజేసి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. ఆయన విజ్ఞప్తితో బాధితులు వంద రోజులకు పైగా కొనసాగిస్తున్న నిరాహార దీక్షను విరమించారు.

తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, హామీ లభించేలా కృషి చేసిన భీం భరత్కు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మాజీ అధ్యక్షుడు మానయ్య, మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, మున్సిపల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ భాస్కర్, మల్లేష్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, హిమాయత్నగర్ మాజీ సర్పంచ్, కౌన్సిలర్లు, గణేష్ గౌడ్, కరణ్, బిక్షపతి, చిలుకూరు రాజు, పార్టీ సీనియర్ నాయకులు, హిమాయత్నగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



# గాంధీ ఆస్పత్రిలో అధునాతన కెడావర్ వర్క్ షాప్

**ఆర్థోపెడిక్ ట్రామా సమ్మిట్ - 2026లో భాగంగా నిర్వహణ..**

**ఎముకల శస్త్రచికిత్సల్లో ఆధునిక మెళకువలపై వైద్యులకు ప్రత్యక్ష శిక్షణ..**



సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) ఆర్థోపెడిక్ వైద్యరంగంలో అత్యాధునిక శస్త్రచికిత్సా పద్ధతులపై అవగాహన పెంపొందించేందుకు సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ మార్చురీలో కెడావర్ వర్క్ షాప్ నిర్వహించారు. హైదరాబాద్ హైటెక్స్లో మూడు రోజులపాటు జరగనున్న ఆర్థోపెడిక్ ట్రామా సమ్మిట్ - 2026లో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఉషారాణి, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీవీ నాగమోహనరావు, ఆర్థోపెడిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ బచ్చు శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్షాప్ను ప్రారంభించారు. వైద్య రంగంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆధునిక చికిత్సా విధానాలు, శస్త్రచికిత్సల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, నూతన సాంకేతిక మెళకువలపై వైద్యులకు మరింత పరిజ్ఞానం లభిస్తుందని వారు పేర్కొన్నారు. వర్క్ షాప్ లో భాగంగా మానవ శరీర నిర్మాణ నమూనాల ఆధారంగా పెల్విస్, ఎసిటాబులమ్, పైకాలు, కిందికాళ్లకు సంబంధించిన శస్త్రచికిత్సా విధానాలు, ఆయా భాగాలను చేరుకునే పద్ధతులపై వైద్యులకు ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. మృతదేహాలపై పరిశీలనలు, అధ్యయనాలు నిర్వహిస్తూ క్లిష్టమైన ఎముకల శస్త్రచికిత్సల్లో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులను వివరించారు.



ఈ శిక్షణ కార్యక్రమం వైద్యుల నైపుణ్యాలను మెరుగుపరచడంతోపాటు సంక్లిష్టమైన ఆర్థోపెడిక్ గాయాలకు సమర్థవంతమైన చికిత్స అందించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గాంధీ ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్లు ప్రభుధీర్, శేఖర్, అనాటమీ విభాగాధిపతి ప్రొఫెసర్ సుధాకర్బాబు, ఆర్థోపెడిక్, ఓటీఎస్ అధ్యాపకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు సహా సుమారు వంద మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## వారసిగూడలో వివాహిత ఆకస్మిక మృతి

**ఏడేళ్ల క్రితమే వివాహం.. ఇద్దరు కుమార్తెలు..**

**మృతిపై అనుమానాలు లేవన్న తండ్రి..**

**కారణాలపై విచారణకు ఫిర్యాదు..**



సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) వారాసిగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని జామై ఉస్మానియా పరిధిలో ఓ వివాహిత ఆకస్మికంగా మృతి చెందింది. సిద్ధార్థ మధువన్ అపార్ట్మెంట్స్ లో నివసించే సుమ (30) అకస్మాత్తుగా కిందపడిపోయి అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నల్గొండ జిల్లా హాలియాకు చెందిన సుమ తండ్రి ఇతిపాముల శ్రీను ఫిర్యాదు ప్రకారం.. 2017 అక్టోబర్ లో రాజుతో ఆమెకు వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటన జరిగిన రోజు సాయంత్రం 4.45 గంటల సమయంలో కుమార్తె తో ఫోన్లో మాట్లాడానని, అప్పటికి ఆమె సాధారణంగానే ఉందని తండ్రి పేర్కొన్నారు. కొద్దిసేపటికే ఆమె మృతి చెందినట్లు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకున్నారు. కుమార్తె వైవాహిక జీవితంలో ఎలాంటి గొడవలు లేవని, ప్రస్తుతం ఆమె మృతిపై తనకు అనుమానాలు లేవని శ్రీను ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ, మృతికి గల కారణాలను నిర్ధారించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. వారసిగూడా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# గాంధీ ఆసుపత్రిలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

**పూల పండుగలో పాల్గొన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది..**

**రోగులు త్వరగా కోలుకోవాలని గౌరమ్మకు ప్రత్యేక ప్రార్థనలు..**

సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన హాస్పిటల్ బ్లాక్ లోని ఫ్లాగ్ పోస్ట్ అసెంబ్లీ ఏరియాలో రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా గౌరమ్మకు పూజలు నిర్వహించారు. మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా రాణి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ-1 డాక్టర్ జయకృష్ణ, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ విద్యతో పాటు నర్సింగ్ అధికారులు, హెడ్ నర్సులు, పేషెంట్ కేర్ ప్రొవైడర్లు పాల్గొన్నారు. విధుల్లో లేని శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సైతం ఉత్సాహంగా పాల్గొని వేడుకలను సందడిగా మార్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు త్వరగా కోలుకోవాలని, రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. అనంతరం డాక్టర్ ఉషా రాణి మాట్లాడుతూ, ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు సిబ్బందిలో ఐక్యతను, సాంస్కృతిక ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని ఈ వేడుకలు చాటిచెప్పాయి.



# పౌర సమస్యలపై ఎంఎంసి కమిషనర్ క్షేత్రస్థాయి సమీక్ష

**ట్రాఫిక్ కష్టాల పరిష్కారానికి జంక్షన్ల అభివృద్ధి..**

**నీటి పునర్వినియోగం, ఆక్రమణల నియంత్రణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి..**

సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పౌరులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి ఆదేశించారు. శుక్రవారం బోయిన్ పల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన ట్రాఫిక్ రద్దీ, నీటి సంరక్షణ, రహదారి ఆక్రమణలు, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. సంగీత్ జంక్షన్ లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఫ్రీ - లెఫ్ట్ సౌకర్యం, రహదారి విస్తరణ అవకాశాలను పరిశీలించి అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వెల్కిన్ అపార్ట్మెంట్స్ లో మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీనివల్ల తాగునీటి వినియోగంపై ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ దిగువ రహదారిపై ఆక్రమణలను పరిశీలించిన కమిషనర్.. ప్రజల రాకపోకలకు ఆటంకాలు కలగకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. దానియాల గుట్ట శ్మశానవాటిక సమీపంలోని శ్యామ్ లాల్ బిల్డింగ్ ప్రాంతంలో పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించి, చెత్త పేరుకుపోయే ప్రాంతాల నుంచి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, అర్బన్ బయో డైవర్సిటీ, రాంకీ, ఈపీటీఆర్ఐ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. గుర్తించిన సమస్యల పరిష్కారానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

# కీసర నూతన ఎస్‌హెచ్‌ఓగా సీఐ ఎలక్షన్ రెడ్డి!

**బాధ్యతలు స్వీకరించిన నూతన ఇన్స్పెక్టర్.. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరిక కీసరగుట్ట భక్తులకు ట్రాఫిక్ తిప్పలు లేకుండా ప్రత్యేక చర్యలు.**

కీసర, అక్టోబర్ 16 (మనం న్యూస్): కీసర పోలీస్ స్టేషన్ బాధ్యతలను నూతన ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్హెచ్ఓ)గా సి.ఐ. ఎలక్షన్ రెడ్డి శుక్రవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో స్వీకరించారు. బదిలీపై వచ్చిన ఆయన స్టేషన్కు చేరుకోగానే సబ్ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.




**అక్రమార్కులకు తావులేదు.. ఫ్రెండ్లీ పోలీసింగ్కే ప్రాధాన్యం!**

పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన సీఐ ఎలక్షన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తన పనితీరు ప్రాధాన్యతలను స్పష్టం చేశారు: 'కీసర పోలీస్ స్టేషన్ పరిధిని నేరరహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే మా ప్రధాన లక్ష్యం. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానాన్ని అమలు చేస్తాం. అదే సమయంలో అక్రమ కార్యకలాపాలు, రౌడీయిజంపై కఠినంగా వ్యవహరిస్తాం.'

**ముఖ్య ప్రణాళికలు యాక్షన్ ప్లాన్:**

గంజాయి, అక్రమ దందాలపై వేటు: మండలంలో గంజాయి విక్రయాలు, మత్తు పదార్థాల సరఫరా, జూదం, అక్రమ దందాల జోలికి వస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని కఠిన హెచ్చరికలు జారీ చేశారు.మహిళలు, ఈవ్ టీజర్లపై నిఘా: మహిళలు, విద్యార్థినుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని, షీ-టీమ్స్ మరియు స్థానిక సీసీ కెమెరాల ద్వారా ఈవ్ టీజర్లపై నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. కీసరగుట్ట భక్తులకు సుఖమయ ప్రయాణం: ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన కీసరగుట్టకు వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్త కుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేస్తామన్నారు.

**రాత్రివేళ నిరంతర పెట్రోలింగ్:**

ప్రధాన రహదారులు, కాలనీల్లో దొంగతనాల నివారణకు రాత్రివేళ 'బ్లూకోల్ట్స్', పెట్రోకార్ విధులను మరింత ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే భద్రత!**

ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు స్థానిక కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు పోలీసులతో భాగస్వాములు కావాలని సీఐ పిలుపునిచ్చారు. గ్రామాలు, కాలనీల్లో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే తక్షణమే డయల్ 100 కి గానీ, పోలీస్ స్టేషన్ నంబర్కు గానీ సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.



# రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలి : ఏబీవీపీ

**ప్రజాస్వామ్య వ్యవస్థలపై విశ్వాసం కాపాడాలని పిలుపు.. ఎస్ఐఆర్ పై ఆరోపణలు ఆధారాలతోనే చేయాలి.. అభ్యంతరాలకు రాజ్యాంగబద్ధ మార్గాలే శరణ్యం..**

సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలు, స్వతంత్ర న్యాయవ్యవస్థపై రాజకీయ పార్టీలు చేస్తున్న విమర్శలను ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఖండించింది. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, రాజకీయ ప్రయోజనాల కోసం సంస్థల విశ్వసనీయతను ప్రశ్నించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలు, న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి పునాదులని, వాటిపై నిరాధార ఆరోపణలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తాయని అన్నారు. ఓటర్ల జాబితాల సవరణకు సంబంధించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై విమర్శలు చేసేటప్పుడు వాస్తవాలు, ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు, భిన్నాభిప్రాయాలకు స్థానం ఉన్నప్పటికీ, రాజ్యాంగ వ్యవస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయకూడదని స్పష్టం చేశారు. ఏవైనా అభ్యంతరాలుంటే చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని కోరారు. విద్యార్థులు వాస్తవాలను పరిశీలించి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వీతేజ, జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలి రాజు, విద్యానగర్ జిల్లా కన్వీనర్ సాయితేజతో పాటు పలువురు ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా అధ్యాపకులకు అంతర్జాతీయ ప్రయాణ గ్రాంట్

**ఉస్మానియా యూనివర్సిటీలో జెండర్ బడ్జెట్ కార్యక్రమం ప్రారంభం.. అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనేందుకు ఆర్థిక చేయూత..**



సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీలో మహిళా అధ్యాపకులను అంతర్జాతీయ పరిశోధనల వైపు ప్రోత్సహించే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రయాణ గ్రాంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెండర్ బడ్జెట్ చొరవలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫ్లయర్ ను శుక్రవారం ఓయూ వీసీ సీనియర్ ప్రొఫెసర్ కుమార్ విడుదల చేశారు. ఈ గ్రాంట్ ద్వారా ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలు, సంస్థలు నిర్వహించే అంతర్జాతీయ సదస్సుల్లో మహిళా అధ్యాపకులు పాల్గొనేందుకు అవకాశం కల్పించనున్నారు.

**పరిశోధనలకు ప్రోత్సాహం.. లింగ సమానత్వానికి ప్రాధాన్యం**

మహిళా అధ్యాపకులకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు పరిశోధన ఫలితాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వీసీ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేశ్రెడ్డి, వీసీ ఓఎస్డీ సీనియర్ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్ మాట్లాడుతూ, ఈ గ్రాంట్ మహిళా అధ్యాపకులకు అంతర్జాతీయ పరిశోధకులతో పరిచయాలు, భాగస్వామ్య పరిశోధనలకు మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జెండర్ బడ్జెట్ నోడల్ అధికారి ప్రొఫెసర్ హమీదా బీతో పాటు పలువురు సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులకు జెండర్ బడ్జెట్ పర్యవేక్షణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# గాంధీ ఆసుపత్రిలో వైభవంగా విజయదశమి పూజలు

**రోగుల ఆరోగ్యం, ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు.. వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, పరిపాలనా సిబ్బంది పాల్గొనడం..**

సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) గాంధీ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగను పురస్కరించుకుని ఆసుపత్రి ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ-1 డాక్టర్ జయకృష్ణ, ఇతర సీఎస్ఆర్ఎంఓలు, అసిస్టెంట్ డైరెక్టర్, మేనేజీరియల్, అడ్మినిస్ట్రేటివ్, కార్యాలయ సిబ్బంది పాల్గొని పూజలు నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని అధికారులు ప్రత్యేకంగా ప్రార్థించారు. అనంతరం డాక్టర్ ఉషారాణితో పాటు ఇతర అధికారులు ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, రోగులు, వారి కుటుంబ సభ్యులకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.



# భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**వజ్ర యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ప్రారంభించిన బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్రెడ్డి..**



ఏఎస్ రావు నగర్, అక్టోబర్ 16 (మనం న్యూస్): ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ భగత్నగర్లో వజ్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి మండపంలో శుక్రవారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా సోమశేఖర్రెడ్డి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. పండుగలు, ఉత్సవాల సందర్భంగా యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అన్నదానం గొప్ప సేవా కార్యక్రమమని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం పుణ్యప్రదమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.

వజ్ర యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నప్రసాదం అందించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో వజ్ర యువజన సంఘం సభ్యులు జోగిని శిరీష, ఉడుత శివ, సందీప్, శ్రీనివాస్, సాయి, రాజు, శివ, సురేష్, శేఖర్, చింటూ, చరణ్, కిషోర్, రోహిత్, గౌతమ్, గణేష్, జశ్వంత్, స్థానిక నాయకులు సత్యమ్మ, రహీం తదితరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**తార్నాక డివిజన్ లో పండుగ ప్రదేశాలను పరిశీలించిన మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి..**

**పారిశుధ్యం, వీధి దీపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచన..**

సికింద్రాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపుకునేలా అవసరమైన అన్ని



సదుపాయాలు కల్పించాలని నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను సూచించారు. దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో తార్నాక డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించి, వేడుకల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త తొలగింపు, పరిసరాల పరిశుభ్రతతో పాటు వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలను సమీక్షించారు. పండుగకు హాజరయ్యే మహిళలు, చిన్నారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాత్రి వేళల్లోనూ తగిన వెలుతురు ఉండేలా చూడాలని, అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో వేడుకల్లో పాల్గొనేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. పండుగ ఏర్పాట్లలో నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకునేలా స్థానికంగా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆమె కోరారు. పండుగ ప్రదేశాల పరిశుభ్రతను కాపాడటంలో ప్రజలు కూడా సహకరించాలని పిలుపునిచ్చారు.

# కమ్మెట గ్రామంలో ఐమాస్ట్ లైట్ల ప్రారంభం

**రూ.6 లక్షలతో ఐమాస్ట్ లైట్ల ఏర్పాటు - గ్రామంలో వెలుగులు నింపిన ఎమ్మెల్యే కాలే యాదయ్య**



చేవెళ్ల, అక్టోబర్ 16(మనం న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మండలం కమ్మెట గ్రామంలో రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే కాలే యాదయ్య ముంఢ్రిక పద్మమ్మ కృష్ణ గౌడ్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.గ్రామంలో రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందించడంతో పాటు, రహదారులు మరియు ప్రధాన కూడళ్ల వద్ద వెలుగులు ఉండేలా ఐమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ లైట్ల ఏర్పాటుతో గ్రామ ప్రజలకు రాత్రి సమయంలో రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు, గ్రామంలో వెలుతురు సమస్యకు పరిష్కారం లభించనుంది.

ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు లావణ్య శంకర్, మాజీ సర్పంచులు పడాల ప్రభాకర్,కేసారం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు వీరేందర్ రెడ్డి, రాజశేఖర్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాంపల్లిలో వైభవంగా మహంకాళి ఉత్సవాలు

**అమ్మవారిని దర్శించుకున్న తోటకూర వజ్రేష్ యాదవ్**

**ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు**





నాగారం, అక్టోబర్ 16 (మనం న్యూస్): నాగారం డివిజన్ రాంపల్లి గ్రామంలో కొలువైన శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో దేవి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా, వేదపండితులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు.

ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, మహంకాళి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, సమాజంలో శాంతి, సోదరభావం వెల్లివిరియాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని, సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించడంలో ఇలాంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భక్తులతో కిక్కిరిసిన ఆలయం మహంకాళి ఉత్సవాలను పురస్కరించుకుని రాంపల్లి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తుల సందడితో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



## సుస్థిర ప్యాకేజింగ్‌పై టీజీ-ప్యాక్కాన్లో చర్చలు

హైదరాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) : ప్యాకేజింగ్ రంగంలో సుస్థిరత, ఆవిష్కరణలు, రీసైక్లింగ్, ఆటోమేషన్, ఎగుమతి పోటీతత్వాన్ని పెంపొందించడంపై సీఐఐ తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్లో నిర్వహించిన టీజీ-ప్యాక్కాన్ 2026లో చర్చించారు. సీఐఐ తెలంగాణ ఛైర్మన్ ఎం.గౌతమ్ రెడ్డి, టీజీ-ప్యాక్కాన్ ఛైర్మన్, ఎకోబ్లిస్ ఇండియా సీఎండీ ఏవీపీఎస్ చక్రవర్తి, ఏపీఈడీఏ ప్రాంతీయ అధిపతి ఆర్.పి.నాయుడు, సీడీఎస్సీఓ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్(ఇండియా) డా.నరేంద్రన్, సీఐఐ తెలంగాణ వైస్ ఛైర్మన్ గౌరవ్ మహేశ్వరి పాల్గొని పర్యావరణహిత ప్యాకేజింగ్, ఔషధ నాణ్యత, ఆహార భద్రత, ప్రపంచ మార్కెట్లకు అనుగుణమైన ప్రమాణాల ఆవశ్యకతను వివరించారు. సుస్థిర పదార్థాలు, వలయాకార ఆర్థిక వ్యవస్థ, నియంత్రణ ప్రమాణాలు, డిజిటల్ సరఫరా గొలుసులపై సదస్సులో చర్చలు జరిగాయి.

## మోతె శోభన్ రెడ్డిని కలిసిన ఆటో యూనియన్ నాయకులు

మేడ్చల్, అక్టోబర్ 16: ( మనం జిల్లా ప్రతినిధి ): తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డిని మేడ్చల్ ఐఎన్టీయూసీ ఆటో యూనియన్ నాయకులు కలిశారు. టీజీసీఎంఎఫ్ప్ మేడ్చల్ అసెంబ్లీ కోఆర్డినేటర్ ఆరె పవన్ కళ్యాణ్ ద్వారా ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆరె మధుకర్ (మాజీ కో-ఆప్షన్ సభ్యుడు), పంజగరి ఆంజనేయులు (మాజీ టౌన్ ప్రెసిడెంట్), ఐఎన్టీయూసీ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎర్ర విజయ్ రావు, ఉపాధ్యక్షుడు ఓంరాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు తమ సమస్యలను మోతె శోభన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



# వ్యవసాయ మార్కెట్ కమిటీలో కొత్త వారికి అవకాశాలు కల్పించాలి

**ఓబిసి విభాగం అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్**



మేడ్చల్, అక్టోబర్ 16: ( మనం జిల్లా ప్రతినిధి): గతంలో అవకాశం వచ్చి వారి పూర్తి కాలం అయిపోయిన కూడా మళ్లీ వారికే పదవులు రిన్వల్ చేయడం ఎంతవరకు సమంజసం అని ఓబీసీ సెల్ విభాగం అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్ ప్రశ్నించారు. ఇప్పటి వరకు అవకాశం రాణి వారు అలాగే ఉండిపోవాలా, వారికి కూడా అవకాశం కల్పించాలి కదాని పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ సోసైటీ నియామకాలలో గతంలో అవకాశం రానివారికి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఓబీసీ విభాగం అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణ ప్రాంతాలు జీహెచ్ఎంసీ పరిధిలోకి విలీనం కావడంతో స్థానికంగా రాజకీయ, పరిపాలనా మార్పులు చోటుచేసుకున్నాయని . అయితే పార్టీ అధికారంలోకి రావడానికి రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ శ్రేణులకు తగిన గుర్తింపు, పదవులు దక్కడం లేదని జిల్లా కాంగ్రెస్ ఓబీసీ విభాగం అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కుటుంబాలను సైతం పక్కనపెట్టి అహర్నిశలు కష్టపడిన నాయకులు, కార్యకర్తలను నేడు పక్కన పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అలాంటి వారికి వ్యవసాయ మార్కెట్ మరియు సుసైటీ కమిటీల విషయంలోనూ పార్టీ కోసం కష్టపడిన కొత్తవారికి అవకాశం కల్పించాలని రవి ముదిరాజ్ కోరారు. గత కమిటీ పదవీకాలం పూర్తయిన అనంతరం కొత్త కమిటీలను ఏర్పాటు చేసే సమయంలో గతంలో పదవులు పొందిన వారికే మళ్లీ అవకాశం కల్పించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంతకాలం పార్టీ కోసం పనిచేస్తూ పదవుల కోసం ఎదురుచూస్తున్న వారికి కూడా అవకాశం ఇవ్వాలని సూచించారు.

# భక్తిశ్రద్ధలతో అమ్మవారి మహా పూజ

**వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భవానీలు, భక్తులు**

**నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సన్నిధానం భవానిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**





చేవెళ్ల, అక్టోబర్ 16(మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మండలం కందవాడ గ్రామంలో శుక్రవారం శ్రీ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సన్నిధానం భవానీల ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి మహాపూజ భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భవానీలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భజన బృందాల కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారి నామస్మరణలు, భజనలతో పూజా ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహాపూజ కార్యక్రమం గ్రామాల మధ్య ఐక్యత, సోదరభావాన్ని చాటిచెప్పింది. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు.

# మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారీ కేంద్రం ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 16 (మనం న్యూస్) : 'మేక్ ఇన్ ఇండియా' దార్శనికతకు అనుగుణంగా లాజిటెక్ మనేసర్లో స్థానిక తయారీ, అసెంబ్లీ కార్యకలాపాలను ప్రారంభించినట్లు లాజిటెక్ చీఫ్ సప్లై చైన్ ఆపరేషన్స్ ఆఫీసర్ చెనించెర్రీ, శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలి దశలో వెబ్కామ్లు, పాయింటింగ్ డివైజ్లను ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంతో సరఫరా వ్యవస్థ సామర్థ్యం పెరిగి, భారతీయ వినియోగదారుల అవసరాలకు వేగంగా స్పందించవచ్చని సంస్థ తెలిపారు. లాజిటెక్ పర్సనల్ వర్క్ సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ డెల్ఫిన్ డొన్నే, ఐఎంఈఏ ప్రాంతీయ డైరెక్టర్ పోలినా అనోఖినా, ఇండియా కంట్రీ హెడ్ మనోజ్ సహాయ్ ఈ విస్తరణలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

